కథానిక

అమ్మకొని అమ్మ



అయ్యగారి శ్రీనివాసరావు

జేబులు తడుముకుని, తృప్తిగా వేలువంక మాసుకుని, ముందుకడుగేశాడు సింహాచలం. ఇవాళ వాడికి చాల ఆనందంగా వుంది. ఎన్నాళ్ళనుండో మనసులో గూడుకట్టుకుని డబ్బులేక అణుచుకున్న కోరిక ఈరోజు తీర బోతూంది. అసలిన్నాళ్ళు తనకా విషయం తెలియనందుకు ఒకవంక ఎంతో బాధపడు తూనే, ఒకవంక ఇప్పటికైనా తెలిసినందుకు సంతోషంగా వుంది. ఇన్నాళ్ళకి తన కోరిక కార్యరూపం ధరిస్తున్నందుకు ఆనందంగా వుంది.

ఆలోచిస్తూ నడుస్తూన్న అతడి కాలికి ఏదో బలంగా తగలడంతో ఒక్కసారిగా "అమ్మా" అని మూలిగాడు. ఆ మాటే అంతులేని మాధుర్యాన్ని ఇచ్చింది. ఇంతలోనే ఇప్పుడు పొందబోతున్న అదృష్టం గుర్తొచ్చి మళ్ళీ కదిలాడు.

'అవును... ఇప్పుడు తను అమ్మ దగ్గరి కెళుతున్నాడు కదా?! ఎలా వుంటుంది. మొన్న రాయుడు గారింటికొచ్చినామెలా వుంటుందా? లేకపోతే ఎవరో పెద్దాయనొస్తే ఆయనకోసం రాయుడుగారుపిలిపిస్తే కారులో వచ్చినావిడలా వుంటుందా? ఛ.. ఛ... అలా వుండదు. అలావుంటే బోల్డుడబ్బులియ్యాలి. మరి తనదగ్గర అంత లేదుగా. అందుకే తక్కువ రేటుకొచ్చే అమ్మనే మాడాలి.'

అలా నడుస్తూ అమ్మ రూపాన్ని తలచు కుంటూన్న సింహాచలంవయసు పదమూడు. తనతో పనిచేస్తున్న అందరికీ అమ్మ వుండడం చూసి, అందరికీ అమ్మ వుంటుందని తెలుసు కుని అందరికీ వున్న అమ్మ తనకు లేకపోవ డంతో ఎక్కడుందోనని ఎక్కడెక్కడో వెతి కినా ఫలితం కనబళ్ళేదు.

అమ్మదగ్గరుంటే, వుండే హాయి గురించి అప్పన్న చెబుతూంటే వినాలనిపిస్తూంటుంది. స్నానం చేయిస్తుందంట! బట్టలు తొడుగు తుందంట! అన్నం పెడుతుందంట! ఎప్పుడూ పని జాగ్రత్తగా చెయ్యమని చెబుతుందంట! పని చేసిన డబ్బులిస్తే ఎంతో సంతోషిస్తుం దంట! ఇంకా ఏమేమిటో చెప్పాడు. కాని గుర్తురాక ఊరుకున్నాడు. అయినా తను కూడా ఇప్పుడెళ్తున్నాడుగా? ఒక్కసారి చూస్తే తెలుస్తుంది! ఆలోచిస్తూన్న అతడికి ఎదురుగా పూల దుకాణం కన్పించేసరికి ఆగాడు.

"అమ్మకి పూలుపట్టుకెళితే?" ఆలోచన.

'అమ్మకి తనలాంటి వాళ్ళు పూలు పట్టు కెళ్ళకూడదేమో! ఎందుకంటే రాయుడు గారు మొన్న వచ్చినావిడ తల్లో పూలు పెడు తుంటే చూశాడు. అదే అప్పన్న గాడితో అంటే! వాళ్ళ నాన్న కూడా వాళ్ళమ్మకలాగే పూలు పెడతాడంట! అంటే అమ్మకి నాన్నే పూలు పెట్టాలి! తను పట్టుకెళ్ళకూడదన్న మాట' ఒక నిర్ణయానికొచ్చి మళ్ళీ సాగి పోయాడు.

తినుబండారాలు కన్పించే సరికి ఒక్క సారిగా కడుపులో ఆకలిగుర్తొచ్చింది. ఆగాడు. అమ్మ దగ్గరికెళ్ళాక అన్నం పెట్టేవరకు తను ఆకలికి ఆగలేడేమో! ఈలోగా ఏమైనా కొను క్కుని తింటే?

'వద్దు. ఉన్న డబ్బులు ఖర్చుపెట్టేస్తే అమ్మ ఒప్పుకోదంట! ఇలాగే చిట్టిగాడు వాళ్ళ నాన్న ఎప్పుడు అమ్మని తెచ్చుకున్నా డబ్బు తక్కువైతే ఒప్పుకోదంట! అదృష్టం అంటే చిట్టిగాడిదే! వాడికి ఎందరమ్మలో! వాడే గాని తనకి చెప్పకపోతే తను ఎప్పటికీ అమ్మని చూడలేక పోయేవాడేమో? వాళ్ళెక్క డుంటారో, ఎలాంటప్పుడు వెళ్ళాలో అన్నీ చెప్పాడు. చిట్టిగాడు చాల మంచివాడు' మన సులో చిట్టిగాడ్ని మెచ్చుకుంటూ ఆకలి మర్చి పోయి వాడు చెప్పిన చోటుకి నడుస్తున్నాడు.

మదిలో ఎన్నో ఊహలు, ఆశలు, అను మానాలు. అన్నిటితోఉన్న సింహాచలం సందు మలుపు తిరిగేసరికి చీకటిగా అన్పించింది. ఒక్కసారిగా దోమలుమూగి మురికి వాసనతో కలిసి స్వాగతం చెప్పాయి.

అక్కడున్న చిన్నగుడిసెలన్నీ గుడ్డివెల్తుర్లో కన్పిస్తున్నాయి. ఆ చీకటిలో కూడా ప్రతి సుమ్మాన్ని పరిశీలిస్తున్నాడు. ఆకారాలు కన్పి స్తున్నాయి. కాని మనుషులు పోలిక దొరకడం లేదు.

'ఇంకొంచం ముందుకిపోతే?' అక్కడి పరిస్థితి అంతే!

కొన్ని ఇళ్ళల్లోకి కొందరెళుతున్నారు. కొన్నిళ్ళల్లోంచి కొందరొస్తున్నారు.

'ఏం చేయాలిపుడు? ఎక్కడికెళ్ళాలి? ఎవర్నడగాలి?' ఏమీ తోచక అక్కడే నిలబడి పోయాడు.

'ఏయ్ బాబు!' పిలుపువినబడ్డంతో అటు చూశాడు. చీకట్లో ఒక అరుగుమీద కూర్చు న్నావిడ తననే పిలుస్తున్నట్లున్నాది. 'పోనీ ఆవిడనడిగితే?' అటడుగేశాడు.

ఇందాకటికంటే ఇప్పుడు కొంచెం కన్పి స్తున్నాది ఆమె ముఖం.

"ఎవరు కావాలి?" ఆవిడ అడగడంతో చెప్పాలా? వద్దా? అని ఆలోచించి, క్షణం తర్వాత.

"అమ్మ కావాలి" అన్నాడు.

ఆ మాట వింటూనే ఒక్కసారి అతడి మొహంలోకి తేరిపార చూసి ఏమనుకుందో గాని,

"ఏం తప్పిపోయిందా?" అడిగింది. ఏం సమాధానం చెప్పాలో తెలియక అవునన్నాడు.

"ఎలా వుంటుంది?" మళ్ళీ ఆమెఅడిగిన ప్రశ్నకి సందిగ్ధంలో పడ్డాడు.

ఏం చెబుతాడు? ఎలా వుంటుందో తనకేం తెలుసు? ఇదివరకెప్పుడూ చూడ లేదుగా? ఇప్పుడే కదా చూడ్డానికొచ్చింది.

'అయినా ఇక్కడికొస్తే అమ్మలుంటారని చిట్టిగాడు చెప్పాడే! మరి ఈవిడేమిటి ఇలా అడుగుతున్నాది?' ఆలోచిస్తూన్న అతడ్ని మళ్ళీ ఆవిడే అడిగింది.

"ఎలా వుంటుంది మీ అమ్మ"

"ఏమో తెలీదు."

"తెలీదా?" ఆశ్చర్యంగా అడిగింది.

"తెలీదు."

"మరి ఇక్కడుందనెవరు చెప్పారు?"

"చిట్టి"

"చిట్టెవరు?"

"నాతో పన్జేస్తూంటాడు. 'వాళ్ళ నాన్నకి ఎప్పుడు కావల్సొచ్చినా చిట్టిగాడి అమ్మలు ఇక్కడ్నుంచే వస్తూంటారని, వచ్చినందుకు డబ్బులియ్యాలని' చెప్పాడు. అందుకేడబ్బులు కూడా తెచ్చాను" అంటున్న అతడి ముఖం లోకి ఆశ్చర్యంగా చూసింది.

ఆ ముఖంలో స్త్రీని నీచంగా కొనుక్కునే వుద్దేశ్యం ఎక్కడా కనబడ్ళేదు. కాని అతడి భావం ఏమిటో పూర్తిగా తెలియటం లేదు. అందుకే అడిగింది.

"మీ నాన్న తెమ్మన్నాడా?"

"నాకు నాన్న కూడా లేదు! నాన్న లేకపోయినా ఫర్వాలేదు. అమ్మని చూడ్డానికే వచ్చాను"

ఆ సమాధానంతో ఆమె మనసు తేలిక పడింది. తెలిసీ తెలియని వయసులో పసి తనంలో ఎవరో ఇచ్చిన సలహాతో అంగడిలో దొరకని తల్లిని కొనుక్కోవాలనే ఆ పసివాడు మాతృప్రేమ కోసం పడే ఆరాటాన్ని అర్థం చేసుకోగలిగింది. ఇంతలో లోపల్నుంచి ఏడుపు వినబడ్డంతో హడావుడిగా పరుగెత్తిందామె.

ఆమె వెనకే లోపలికెళ్ళాడు సింహాచలం.

ముందు ఒక చిన్నగది! ఆ పక్కనే మరో గది! ముందుగదిలో నేలమీద కూచుని పాపకి పాలిస్తోంది. ఆవిడనలాగే చూస్తూండిపోయిన సింహాచలాన్నడిగింది.

"అయితే నీకెలాటి అమ్మ కావాలి?"

సమాధానం చెప్పబోయేంతలో బయట నుంచి ఎవరో రావడంతో పాపనక్కడొదిలేసి వెళ్ళిపోయింది. మధ్యలో పాలు ఆపడంతో గుక్క తిప్పుకోకుండా ఏడుస్తోందా పాప. ఎంత ఏడ్చినా లోపల్నుంచి రావడంలేదు. ఉండబట్ట లేక ఎత్తుకున్నాడు. లాలించాడు. కదిపాడు. ఏడుపాపకపోవడంతో భుజాన వేసుకుని తిప్ప డంతో ఏడుపాపిన పాపని అలాగే తిప్పు తున్నంతలో లోపలికొచ్చిన మనిషి వెళ్ళిపోవ డంతో బయటికొచ్చిందామె.

ఆ స్థితిలో తనని చూసిన సింహాచలాన్ని చూసినామె మనసులో ఏదో తెలియని భయం ఆవహించి అంతలోనేసర్దుకుంది. సింహాచలం అదేదీ పట్టించుకోలేదు.

"అమ్మ అన్నం పెడుతున్నపుడు ఎవరు పిలిచినా ఎక్కడికీ వెళ్ళదని అప్పన్న చెప్పాడు" సింహాచలం మాటతో యదలో శూలాలు గుచ్చినట్టనిపించింది.

"ఆ పాప ఆకలి తీర్చడానికి డబ్బులు కావాలిగా? అందుకేలోపలికెళ్ళాను" యదలో బాధని అణుచుకుంటూ అందామె.

"డబ్బులు నన్నడిగితే ఇద్దును కదా? మరి పాపనెందుకొదిలిపెట్టావ్? పాపం చూడు! ఆకలికి ఎలా ఏడుస్తుందో!" పాపని ముందుకు తిప్పి అన్నాడు. ఆ మాటలోని ఆప్యాయతకు కరిగిపోతూ ఆ పాటి అనురాగం కూడా తన బిడ్డమీద చూపలేకపోతున్నందుకు కుమిలి పోయిందామె.

"బాబూ నీకు అమ్మ కావాలన్నావ్ కదూ?" అడిగింది.

"ఔను"

"ఎలాంటమ్మ కావాలి!"

"అమ్మలాటి అమ్మ" ఏం చెప్పాలో తెలియక తన మనసులోని అమ్మ రూపాన్ని ఆ విధంగా చెప్పాడు.

"డబ్బెంత తెచ్చావ్?"

"ఇదిగో ఇరవై రూపాయలు తెచ్చాను. ఇంకా చాలకపోతే ఇంకా తెస్తాను. కాని నాకు మాత్రం అమ్మలాటి అమ్మ కావాలి" ఆ మాటలోనిమాతృప్రేమకు కరిగిపోయిందామె.

ఏ ఆలోచన లేని ఆమె జీవితంలోకి తొలి సారిగా వచ్చిన ఆలోచన "రోజుకెందరికో వెలయాలిగా అమ్ముడుపోతూ, ఎవరికీ కాక చివరికి ఆలి కాలేక, వెలలేక వెలవెలబోయే కంటే తల్లిగా అమ్ముడుపోతే" ఒక నిర్ణయాని కొచ్చి అందామె.

"బాబూ నీకు నేను అమ్మనౌతాను నీ కిష్టమేనా?" ఆ బిడ్డ తనలాంటి దాన్ని తల్లిగా స్వీకరిస్తాడో లేదో అనే అనుమానంతో అడి గింది.

"మరి పాపకు నాకు రోజూ అన్నం పెడతావా? డబ్బులు నేను తెస్తాగా?" బతుకు నేర్పిన సంపాదనా ధైర్యంతో అడి గాడు.

"తప్పకుండా. మరి నా మాట వింటావా?" ఆ అడగడంలో మాతృ మాధుర్యం తొలిసారిగా చవిచూసింది.

"అమ్మ ఏం చెప్పినా చెయ్యాలని అప్పన్న చెప్పాడు. ఏం చెయ్యమంటావ్?" తొలిసారి తల్లితో మాట్లాడిన అనుభూతి అది!

"అమ్మకి రోజుకి నువ్వెంతియ్యగలవ్?"

"వచ్చిందంతా అమ్మకే ఇయ్యాలని అప్పన్న చెప్పాడు."

"అలా కాదు. కొన్నాళ్ళపాటు నువ్వు ఒక్కడివే ఉండి ఎంత దాచగలవ్?"

లెక్కలేసి చెప్పాడు. ఆ జవాబుతో ధైర్యం వచ్చింది.

"ఆ డబ్బులన్నీ కూడాక ఈ అమ్మకియ్య గలవా?" ఆమె అలా అడిగినప్పుడు ఆమె తెగిన గుండె నరాల చప్పుడు వినబళ్ళేదు సింహాచలానికి.

"అలాగేమరినాకుఅమ్మగావుంటావా?" ఎందుకో నమ్మబుద్ధి కాక అడిగాడు.

"తప్పకుండా బాబు! కాని ఈ అమ్మ నీకు కావాలంటే వెయ్యి రూపాయిలు తెచ్చే వరకు ఇక్కడికి రాకూడదు" తను ఈ పాపకూపంలోంచి బయట పడడానికి పసి బిడ్డ నెత్తిన మోయలేని భారం మోపుతున్నా తప్పలేదు.

ఆమాట విన్నాక ఆశనిపాతంలా తోచినా మనసులోని కోరిక గాఢత అతడ్ని జయిం చింది. "అలాగే వెయ్యి రూపాయిలు తెస్తే ఎప్పుడూ నాతోనే వుండిపోతావా?"

ఆ మాట వినగానే ధైర్యం వచ్చింది. మాతృత్వంతో ఆబిడ్డని బంధించింది. ఇక్కడి పరిస్థితి రోజూ చూసి తల్లిమీద ఆ బిడ్డకున్న గౌరవాన్ని అసహ్యంగా మారకుండా ఉండేం దుకు కొన్నాళ్ళపాటు రాకుండా అడ్డు విధిం చింది. ఆడపిల్లగా పుట్టిన తన బిడ్డని తిరిగి ఆ నరకంలో పడకుండా కాపాడుకోవడానికి ఆ పసిబిడ్డకి తల్లిరూపంలో వచ్చిన అవకాశాన్ని అభినందించుకుని అంది.

"నాకు నువ్వు వెయ్యి రూపాయిలిచ్చిన వెంటనే నేను ఈ ఇల్లువదిలి నీతో వచ్చేస్తాను. నిజంగా మా అమ్మ మీద ఒట్టు" తనమీద పూర్తి నమ్మకం కలగడంతో అందామె.

"అలాగే నువ్వుచెప్పిన డబ్బులు పట్టుకుని తొందరగానే వస్తాను. అంతవరకెక్కడి కెళ్ళకు" అంటున్న ఆ బిడ్డకి సమాధానం చెప్పలేక వెళ్ళనన్నట్లు తలవూపింది. ఆ హామీ తో దొరికిన తల్లిని పొందే ప్రయత్నంలో కార్యోన్ముఖుడై వెళ్ళిపోతున్న ఆ బిడ్డనలాగే చూస్తూండిపోయిందామె.

కథా రచయితలకు ఆహ్వానం

తెలుగువారి జీవనాన్నీ, సంస్కృతినీ సంఘర్షణనీ ప్రతిబింబించే కథలకు 'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆహ్వానం పలుకుతోంది.

మానవ జీవనంలోని వివిధ కోణాలమీద వెలుగు ప్రసరించే, ఆసక్తి కరమైన కథలకు ప్రాధాన్యత వుంటుంది. కథలు నాలుగు లేక అయిదు అరఠావులకు మించకూడదు. కనీసం 2,500 పదాలకు తగ్గక ఉండాలి! కథలు ఈ కింది చిరునామాకి పంపించాలి.

ఎడిటర్,
'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆంధ్రజ్యోతి దినపత్రిక,
బంజారా హిల్స్, రోడ్ నెం.3,
హైదరాబాద్- 500 034